# తల్లి మనసు

## -ఎనుగంటి వేణుగోపాల్

శైలజకి డెలివరీ అయ్యిందన్న కబురు తెలియగానే ఆఫీసులో సెలవు గ్రాంట్ చేయించుకుని హుటాహుటిన హాస్పిటల్‌కి బయల్దేరాడు మహేష్. నార్మల్ డెలివరీ అవడంతో నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నా కూతురు పుట్టిందని ఉస్సూరుమందతని ప్రాణం.

"తొలి సంతానం కూతురైతే ఇంట్లో లక్ష్మి తాండవిస్తుందట. కొడుకు పుట్టలేదని మొహం చాటేయకండి. పాపని చూడండి చిరునవ్వులొలకబోస్తూ మహలక్ష్మిలా ఎలా వెలిగిపోతోందో!'' భర్త అంతరంగం ఎరిగిన శైలజ నగుమోముతో మహేష్‌కి పాపని అందించింది.

భార్యమీద అతనికి వల్లమాలిన అభిమానం. అందుకని మౌనంగా తలూపుతూ బిడ్డని మురిపెంగా ముద్దాడాడు.

* * *

కాలచక్రం గిర్రున తిరిగింది. పాపకి వనజ అని పేరు పెట్టుకుని ఆమె సాంగత్యంలో సర్వం మరిచిపోతున్నాడు మహేష్. రెండేళ్ళు హాయిగా గడిచాయి. శైలజ రెండవసారి నీళ్ళోసుకుంది. మహేష్ మహదానందపడిపోయాడు.

"చూశావా శైలూ! దేవుడు నా వైపే ఉన్నాడు. ఈసారి మాత్రం తప్పక మగపిల్లాడే'' అన్నాడు భార్యతో.

* * *

భర్త సంతోషమే తన ఆనందంగా భావించే శైలజ నవ్వి ఊరుకుంది. ఒకరోజు అర్ధరాత్రివేళ పురిటినొప్పులు మొదలవ్వడంతో కంగారుపడ్డ మహేష్ ఆటో తెచ్చి శైలజను హాస్పిటల్‌లో అడ్మిట్ చేశాడు. తెల్లవారుఝామున ప్రసవం జరిగిందామెకు. మళ్లీ పాప! మహేష్ ఊహించనిదిది.

"మారుతున్న కాలమిది. కొడుకైనా, కూతురైనా ఒకటేనండి. వాళ్ళు ప్రయోజకులై మనకి పేరు తేవడమే కాక అవసానదశలో మనకి ఆలంబనగా నిలబడితే చాలు. పున్నామనరకం నుండి తప్పించేవాడే కొడుకైతే..ఎంతమంది పుత్రులు బ్రతికుండగానే తల్లితండ్రులకి ప్రత్యక్ష నరకం చూపించడం లేదు. నేనంటే మీకెంత ప్రేమో, మీకంటే ఎక్కువగా నాకు తెలుసు. ఇదే ప్రేమాను రాగాన్ని పిల్లలిద్దరికీ పంచుదామండీ''

నోరు తెరిచి తనకంటూ ఏనాడూ ఏదీ కోరని భార్య ఈరోజు ఇలా మనసు విప్పి ఆప్యాయంగా అడుగుతుంటే మహేష్ మారుమాట్లాడలేదు. రెండవకూతురుని కూడా ప్రేమగా గుండెకి హత్తుకున్నాడు. అపురూప దాంపత్యానికి అసలైన నిర్వచనంలా వాళ్లిద్దరి సంసారం హ్యాపీగా సాగింది.

* * *

అలా అలా ఐదు సంవత్సరాలు గడిచాయి. పెద్దమ్మాయి వనజ సెకండ్‌క్లాస్‌కి వచ్చింది. చిన్నమ్మాయి గిరిజ యూకేజీ చదువుతోంది.

కొడుకులు లేని లోటు తీరేలా ఆటపాటల్లో, చదువుసంధ్యల్లో అలా అన్నిటా ఫస్ట్ వస్తున్న ఇద్దరమ్మాయిల్ని చూసి మహేష్ గర్వపడుతున్నాడిప్పుడు. ఉద్యోగంలో ఒత్తిడి, ఇన్‌స్పెక్షన్స్, టూర్ల పేరుతో తను ఆఫీసుల్లో మునిగితేలుతున్నా శైలజ పిల్లల పట్ల చూపిస్తున్న ప్రత్యేకశ్రద్ధ, పెంపకపు తీరు అతడ్ని ముగ్ధుడ్ని చేస్తోంది. అందుకే భార్య మీద ప్రేమ రెట్టింపయ్యింది.

అలా వాళ్ళ కాపురం హాయిగా సాగుతున్న తరుణంలో జరిగిందా ఘోర సంఘటన.

వనజ గిరిజల్ని ప్రతిరోజూ స్కూల్‌కి తీసుకెళ్ళే ఆటో మెయిన్‌రోడ్ మలుపులో అదుపుతప్పి బోల్తా పడిపోయింది. బోల్తాపడిన ఆ ఆటోని వేగంగా దూసుకువస్తున్న బస్ ఢీ కొనడం క్షణంలో జరిగిపోయింది. ఆ వేళ భూమాతకో రక్తపు చారికను అద్దిందా ఆక్సిడెంట్.

ఆటోలో ఉన్న పన్నెండుమంది పిల్లల్లో ఆరుగురు అక్కడికక్కడే చనిపోయారు. మిగతావాళ్లకి తీవ్రంగా గాయాలయ్యాయి.

ఇదో శోకతప్త విషాదమైతే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికిద్దరు పిల్లలు వనజ, గిరిజలు నేలరాలడం...అటు పేరెంట్స్‌కి రక్తపుకోతని మిగల్చడమే కాక ఇటు ఊళ్ళో వాళ్ల గుండెల్ని సైతం పిండేసింది. పిల్లల మరణవార్తకి శైలజ గుండె ఆగిపోలేదు. మూర్తీభవించిన విషాదమై కన్నీటి అలలపై తేలియాడుతోంది. మహేష్ గుండె నిబ్బరం చేసుకున్నాడు. కంటికిమింటికి వారధి చేస్తున్న భార్య కన్నీళ్లని తుడిచే ప్రయత్నం కూడా చేయలేదు. లాలనగా ఆమెని పొదివి పట్టుకున్నాడు.

* * *

సరిగ్గా ఏడాది గడిచింది.

ఇద్దరు పాపలు కనుపాపల ఉపరితలాలపై అశ్రుకణాలై తారట్లాడ్తుంటే శైలజ మాతృహృదయం తల్లడిల్లిపోయింది. అమ్మ మనసు చెమ్మగిల్లింది.

సంవత్సరీకం వంటి సంప్రదాయిక కార్యక్రమాలు పూర్తయ్యాక నెమ్మదిగా శైలజ భర్త ముందు పెదవి విప్పింది.

"పిల్లల పేర్ల మీద అర్చన చేయించాలి. విజయవాడ కనకదుర్గమ్మని దర్శిద్దామండీ!'' భర్తనడిగింది లాలనగా.

"అలాగే శైలూ! రేపే బయల్దేరదాం'' ఆప్యాయంగా అన్నాడు మహేష్, ఇలాగైనా భార్యకి బయటిగాలి తగిలి మనసు కుదుటపడ్తుందని.

మరుసటిరోజు భార్యని తోడ్కొని విజయవాడకి ప్రయాణమయ్యాడు.

* * *

ఉదయాన్నే దైవదర్శనం చేసుకున్న భార్యాభర్తలిద్దరూ గుడినుండి వెలుపలికి వస్తుంటే...

ఏడాదైనా పూర్తిగా నిండని చిన్న పసిపాప గుక్కపట్టి "అమ్మా!'' అని వలవల ఏడుస్తూ వాళ్ల కంటపడింది. శైలజ పరుగుపరుగున వెళ్లి పాపని దగ్గరికి తీసుకుంది. ఓదార్చింది. అనురాగంతో గుండెకి హత్తుకుంది. భార్య కోరిక మీద అక్కడున్న వాళ్లందర్నీ ఆరా తీశాడు మహేష్.

అందరినుండి "ఈమె మా పాపకాదు..'' అనే సమాధానమే వచ్చింది. ఎంక్వయిరీ గదికి వెళ్లి అనౌన్స్ చేయించాడు. ఆ పాప దొరికిన చోటుకే మళ్లీ వెళ్ళి రోజంతా అక్కడే ఉండి ఒపిగ్గా పాప పేరెంట్స్ కోసం వాకబుచేశాడు. అయినా ఫలితం లేకపోయింది. శైలజ పాపకి బిస్కెట్లు కొనిపెట్టింది. హోటల్లో పాలు తాగించింది. పళ్లు తినిపించింది. బొమ్మలు కొని ఆడించింది. పాపేమో మరిక ఏడ్వలేదు. ఏడాది గడిచిన తర్వాత భార్యలో మునుపటి ఉత్సాహం తొణికిసలాడడం గమనించి సేదతీ

రాడు మహేష్. ఆ పాప పట్ల భార్య చూపిస్తున్న ఆప్యాయత అతన్ని కట్టిపడేసింది.

"ఏవండీ!.." భర్త కళ్లల్లోకి గోముగా చూసింది శైలజ.

"చెప్పు..." అనునయంగా అడిగాడు.

"నేనే వేడుకున్నానో, కనకదుర్గమ్మే కరుణించి వరమిచ్చిందో ఈ పాప మనకి దొరికింది. ఎలాగూ మనకి పిల్లలు కలుగరు. దీన్ని కన్నబిడ్డలా పెంచి పెద్ద చేద్దామండీ. ఈ జీవితానికో వరం ప్రసాదించండి" ఆర్ద్రతా భరితమైందామె గొంతు.

పిల్లల్ని పోగొట్టుకుని పిల్లల కోసం ఆ తల్లి మనసు ఎంత తల్లడిల్లిపోతోందో అర్థం చేసుకోగల మంచి మనసున్న వ్యక్తి మహేష్.

పాప విషయమై పేపర్ ప్రకటన ఇద్దామనుకున్న మహేష్ తన ఆలోచన మానుకుని శైలజని రెండుచేతుల్తో పొదివి పట్టుకుని ఆమె భుజాల్ని సుతిమెత్తగా నొక్కి వదిలాడు ఆమోదసూచకంగా.

"ఈ పాప నిజంగా మిస్సయ్యిందో..కావాలని దేవాలయ ప్రాంగణంలో వదిలేశారో తెలీదు కానీ ఆ పేరెంట్స్ ఈ పాపని కావాలనుకుని పేపర్ ప్రకటన ఇస్తే మాత్రం అప్పజెబుదామండి. అందాక ఇది మన పాప" అందామె ఉద్వేగంగా.

ఒకే అన్నట్లు తలాడించాడతను.

భర్త సహృదయతకి ఆ తల్లి ఆరాధనగా చూసిందతని వంక.

★

